- సిరిసిల్ల కన్నా ఎక్కువ చూసుకుంటా
- నేను, గంప గోవర్ధన్ కలిసి నిత్యం పర్యవేక్షిస్తాం
- కేసీఆర్ వచ్చాక కామారెడ్డి దశ తిరుగుతుంది
- సలాకలు, సిమెంట్ ఇచ్చేటోళ్లను నమ్మొద్దు
- కేసీఆర్ వస్తుండనే షబ్బీర్ పారిపోతుండు
- కొడంగల్‌లో గెలవని రేవంత్ ఇక్కడ గెలుస్తడా
- కామారెడ్డి, మాచారెడ్డి సభల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని క్షమించేది లేదన్న కేటీఆర్


మాచారెడ్డి సభా వేదికపై మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్‌రెడ్డి తదితరులు

# కామారెడ్డి అభివృద్ధికి నాది జిమ్మేదార్


కామారెడ్డిలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నిజామాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కామారెడ్డి, మాచారెడ్డి :

**కేసీఆర్ వచ్చాక** కామారెడ్డి అభివృద్ధికి నేనే జిమ్మేదార్‌ని అంటూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రకటించారు. కామారెడ్డిని సిరిసిల్ల కన్నా మక్కువగా చూసుకుంటానని, కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. గంప గోవర్ధన్‌తో కలిసి కామారెడ్డి నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యత ఇరువురిదనే చెప్పారు. నవంబర్ 9న కేసీఆర్ నామినేషన్ దాఖలు చేస్తారని, ఈ సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో ప్రజలంతా హాజరై దీవించాలని కోరారు. అఖండ మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో ఏ మూలకెళ్లి పోటీచేసినా గెలిచే దమ్మున్న కేసీఆర్.. ఈ కామారెడ్డినే ఎంచుకోవడం ఈ ప్రాంత అదృష్టమని కేటీఆర్ స్పష్టం చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో పాత మాచారెడ్డి, కామారెడ్డి పట్టణం, కామారెడ్డి రూరల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి కీలక ప్రసంగం ఇచ్చారు. ప్రతిపక్షాల తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదన్నారు. ఈ మధ్యనే ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డిపై ఓ నాయకుడు చేసిన దుర్భషలాటను కేటీఆర్ ప్రస్తావించారు. ఎంతటి వారైనా పార్టీ సిద్ధాంతాల మేరకు నడుచుకోవాలని సూచించారు. లేదంటే వేటు తప్పదని హెచ్చరించారు. కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ సమక్షంలో బీజేపీ నేత ఎంజీ వేణుగోపాల్ గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు.



డాక్టర్లతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

## మరింత అభివృద్ధి..

కామారెడ్డి, అక్టోబర్ 31: సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయడంతో మరింత అభివృద్ధి చెందుతుందని, భారీ మెజార్టీతో గెలిపించాలని డాక్టర్లు, కుల సంఘాల ప్రతినిధులను మంత్రి కేటీఆర్ కోరారు. పట్టణంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సమావేశమయ్యారు. కరోనా సమయంలో వైద్యులు అనేక సేవలు చేశారని, వైద్యులపై భౌతిక దాడులు జరగకుండా చట్టాలు తీసుకువస్తామని అన్నారు.

## పాత మాస్టర్ ప్లానే అమల్లో ఉంటుంది..

కామారెడ్డి నియోజకవర్గం రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా అవుతుందని కేటీఆర్ చెప్పారు. కామారెడ్డి పట్టణాన్ని దేశంలోనే నంబర్ వన్ సిటీగా మార్చే బాధ్యతను తానే తీసుకుంటానని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేశామని మరోసారి గుర్తుచేశారు. పాత మాస్టర్ ప్లాన్ అమల్లో ఉంటుందన్నారు. కామారెడ్డి నుంచి కేసీఆర్‌పై పోటీ చేయడానికి షబ్బీర్ అలీ భయపడి పారిపోతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో గెలవని రేవంత్ రెడ్డి ఇక్కడికి వచ్చి పోటీ చేస్తాననడం సిగ్గుచేటన్నారు. ఉద్యమ ద్రోహికి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కామారెడ్డి ప్రజలంతా బుద్ధి చెబుతారన్నారు. సలాకలు, సిమెంట్ పంపేవారిని నమ్మొద్దని, టక్కుటమారా జిమ్మిక్కులు నడువవు అంటూ బీజేపీకి చురకలు అంటించారు. చాక్లెట్లు, పిప్పరమెంట్లకు ముగ్గులు కావొద్దని, కేసీఆర్‌తో దమ్ బిర్యానీ వస్తుందంటూ జోష్ నింపారు. సలాకలు ఇస్తా, సిమెంట్ ఇస్తా ఓటెయ్యండంటే మనమంతా పిచ్చోళ్లమా? అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి, బీజేపీకి కామారెడ్డి ఉద్యమ సత్తా ఏమిటో చూపెట్టి వారి డిపాజిట్ గల్లంతు చేయాలన్నారు. కాంగ్రెసోళ్లు ఒక్క చాన్స్ ఇయ్యమంటున్నారని, ఇప్పటి వరకు కాంగ్రెసోళ్లకు 11 చాన్సులు ఇచ్చామన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని నడుపుమని 55ఏండ్లుగా దళితులు, మైనార్టీలు, బలహీనవర్గాలు, బీద, బిక్కి రైతులు ఓట్లేస్తే ఉద్ధరించిండ్రా అంటూ మండిపడ్డారు. బార్‌బార్ మోఖా దియా.. హమ్‌కో బార్‌బార్ ఉనోనే దోఖా దియా అంటూ వ్యాఖ్యానించారు. 55 ఏండ్లు సక్కగా కాంగ్రెస్ పాలన ఉండి ఉంటే.. కరెంట్ చక్కగా ఇచ్చి ఉంటే..మంచి నీళ్లు ఇచ్చి ఉంటే.. గోదావరి నీళ్లు తెచ్చే ప్రయత్నం చేస్తే ఈ సమస్యలు ఉంటుండేనా అంటూ ప్రశ్నించారు. ఒక్క చాన్స్ అంటే నమ్మొద్దు అని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ అయాచితం శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్, నిట్టు వేణుగోపాల్, ఎంపీపీ నర్సింగరావు, పున్నా రాజేశ్వర్, కేసీఆర్ బావ వకీల్ రామారావు, సుభాష్ రెడ్డి, గంప శశాంక్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 30 రోజులు అప్రమత్తంగా ఉండండి..

రానున్న 30 రోజులు అప్రమత్తంగా ఉండాలని, కాకిరిపీకిరి కథలు చెప్పే ప్రతిపక్షాలకు బుద్ధిచెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. గజ్వేల్ అందంగా మారిందని, అంతకన్నా అందంగా కామారెడ్డి అవుతుందన్నారు. మన ఊర్లు బాగుపడుతాయని, ఆరు నెలల్లోనే సమస్యలు మాయం అవుతాయన్నారు. కామారెడ్డిపై ప్రేమతో కేసీఆర్ వస్తుండని, కడుపు నిండా ఆశీర్వాదం ఇచ్చి అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రైతుల కోరిక మేరకు ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకు వస్తామన్నారు. మిగిలిపోయిన గిరిజనులకు పోడు పట్టాలు అందిస్తామన్నారు. మంచిప్ప నుంచి ప్యాకేజీ 22 ద్వారా నీళ్లను తీసుకువస్తామన్నారు. ఐదారు నెలల్లోనే ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చి రైతుల పాదాలను కడుగుతామని హామీ ఇచ్చారు. కాలువలు తవ్వేటప్పుడు రైతులంతా సహకరించాలని విన్నవించారు. కేసీఆర్‌కు భూములు గుంజుకునే అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. మతిలేని ప్రతిపక్ష పార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని చెప్పారు. కామారెడ్డి బాగుకోసమే కేసీఆర్ వస్తున్నారని చెప్పారు. జల్ జంగల్ జమీన్ అని కొమురం భీమ్ నినాదాన్ని అర్థవంతంగా, ఆచరణలో పెట్టి చూపిస్తున్నది కేసీఆర్ మాత్రమేనని చెప్పారు.

## గజ్వేల్ మాదిరిగానే కామారెడ్డికి స్పెషల్ ఆఫీసర్...

కామారెడ్డి నియోజకవర్గం కోసం మిషన్ భగీరథ పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైపులు మార్చేందుకు రూ.195కోట్లు మంజూరు అయ్యాయని కేటీఆర్ అన్నారు. నాలుగైదు నెలల్లోనే పనులు పూర్తిచేస్తామన్నారు. ఎండాకాలంలో గోస లేకుండా తాగు నీరు అందిస్తామన్నారు. బాధ్యత నేనే తీసుకుంటానని కేటీఆర్ చెప్పారు. ఫరీద్‌పేటకు చెందిన ముత్యంరెడ్డి అనే ఆఫీసర్‌ను పెట్టి గజ్వేల్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కేసీఆర్ కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి మోడల్‌లోనే కామారెడ్డిలోనూ చిటికెలో సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. పూర్తిస్థాయిలో తద్వారా సమస్యలన్నీ సత్వరమే పరిష్కారం అవుతాయన్నారు. కుండబద్దలు కొట్టారు. సంపూర్ణంగా నిధులిచ్చి వంద రెట్లు అభివృద్ధి చేసే బాధ్యత నాదేనంటూ సీఎం కాలు పెట్టగానే అడగకుండానే అయిపోయే పనులు జరిగిపోతాయన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలంతా 30 రోజులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రతి రోజూ మీ గ్రామాల్లో, మీ వాడల్లో చర్చ పెట్టి కేసీఆర్ చేసిన పనులపై వివరించాలన్నారు. కేసీఆర్ రాకతో కామారెడ్డి నియోజకవర్గానికి జరిగే ఫలితాన్ని వివరించాలన్నారు. సర్వ రోగ నివారిణి జిందా తిలిస్మాత్ అన్నట్లుగా కేసీఆర్ వచ్చినంక అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు.


## సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం..

**ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్**



2001లో బీఆర్ఎస్ పార్టీ స్థాపించిన అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 13 ఎంపీటీసీ స్థానాలకు తొమ్మిది, జడ్పీటీసీ స్థానాన్ని ఏకగ్రీవం చేసిన ఘనత మాచారెడ్డికి దక్కుతుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఉద్యమాల గడ్డ నుంచి ఉద్యమించిన నాయకుడు సీఎం కేసీఆర్ పోటీ చేయడం కామారెడ్డి ప్రజల అదృష్టమని అన్నారు. 14ఏండ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ చేతిలో ఉంటేనే భద్రంగా ఉంటుందని, రాష్ట్ర ప్రజలు తొమ్మిదిన్నరేండ్లు అధికారం కట్టాబెట్టారని వివరించారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ భరోసా పేరుతో ఇటీవల ప్రకటించిన మ్యానిఫెస్టో సామాన్యులకు ఎంతో లబ్ధి చేకూర్చుతుందన్నారు. నెల రోజులపాటు ప్రతి కార్యకర్త, నాయకుడు ఇంటింటికీ తిరిగి సీఎం కేసీఆర్‌కు భారీగా మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు.


కామారెడ్డి సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


కామారెడ్డిలో బీజేపీ నేత ఎంజీ వేణుగోపాల్‌కు గులాబీ కండువా వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్


మాచారెడ్డిలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

## మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో భారీగా చేరికలు

మాచారెడ్డి,అక్టోబర్ 31: మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో రెడ్డిపేట మాజీ సర్పంచ్ నర్సాగౌడ్ కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. పాల్వంచ, ఘన్‌పూర్, రెడ్డిపేట, అన్నారం గ్రామాల నుంచి దాదాపు 500 మంది నాయకులు కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి కేటీఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


కామారెడ్డిలో మహిళా ప్రజాప్రతినిధులతో మంత్రి కేటీఆర్, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి

## మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలి..



మరోసారి బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి, సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి. తెలంగాణ వచ్చిన తర్వాత కామారెడ్డి ఎలా ఉందో ప్రజలు గమనించాలి. జిల్లాగా ఏర్పడిన తర్వాత అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ స్వయంగా పోటీ చేస్తున్నారు. మనమంతా కష్టపడి కేసీఆర్‌ను గెలిపించుకోవాలి.

**- తిర్మల్ రెడ్డి, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్**

# కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ముదిరాజ్ కుటుంబసభ్యులు



ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను సన్మానిస్తున్న ఎంబీసీ కులస్తులు

- ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చేందుకు కృషిచేస్తా..
- ఆత్మీయ సమ్మేళనంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి/ఇందల్వాయి, అక్టోబర్ 31: కాంగ్రెస్ నాయకులు చెప్పే మోసపూరిత మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో రూరల్ నియోజకవర్గ ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 88 గ్రామాల్లో ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టామని, రూ.3.69 కోట్లు నిధులు మంజూరు చేశామని తెలిపారు. ముదిరాజ్ కులస్తులను బీసీ –డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గంగపుత్రులు లేని గ్రామాల్లో మత్స్యకార సొసైటీల్లో ముదిరాజ్‌లకు సభ్యత్వం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రూరల్ ఇన్‌చార్జి వీజీగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పాలకులు కులవృత్తులను నిర్లక్ష్యం చేయడంతో వారు వలసలు వెళ్లారని గుర్తుచేశారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు లల్లూ ముదిరాజ్ మాట్లాడుతూ.. రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

**నామినేషన్ ఖర్చులకు పింఛన్ డబ్బులు..**

గుండారం మాజీ ఎంపీటీసీ సరిత తనకు వచ్చిన బీడీ పింఛన్ డబ్బులను రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు నామినేషన్ ఖర్చుల నిమిత్తం అందజేశారు. 5 నెలల పింఛన్ డబ్బులు రూ. 10 వేలను తన భర్త గుండారం ఎంపీటీసీ అంకం గంగాధర్‌తో కలిసి బాజిరెడ్డికి ఇచ్చారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

**కులవృత్తులను ఆదుకున్నది సీఎం కేసీఆరే..**

కులవృత్తులను ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లిలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో ఎంబీసీ కులాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కుమ్మరి, రజక, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, మేదరి, మేరు, వడ్డెర కులస్తులకు కేసీఆర్ ఎన్నో పథకాలు తీసుకవచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల రత్నాకర్, ఇతర కుల సభ్యులు పాల్గొన్నారు.

# జీతగాడిలా పనిచేశా.. ఆశీర్వదించండి


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన గురడి రెడ్డి కుటుంబసభ్యులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



**ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**

ఆర్మూర్‌టౌన్/ ఆర్మూర్,అక్టోబర్31: తన గెలుపు ఆర్మూర్ అభివృద్ధికి మరో మలుపు అని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని గురడి రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆర్మూర్ నియోజకవర్గ గురడి రెడ్డి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్మూర్ ప్రగతికి మారుపేరని, కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నష్టపోతామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో సబ్బండవర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. తాను ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదని, పదేండ్లుగా మీ జీతగాడిలా పనిచేశానని అన్నారు. ఆర్మూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చి ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చానని తెలిపారు. ఆర్మూర్ అభివృద్ధి ఉట్టిపడేలా తొమ్మిదికిపైగా బైపాస్ రోడ్లు వేయించానని వివరించారు.రూ.20కోట్లతో సిద్ధులగుట్టకు ఘాట్‌రోడ్ వేయించి పరమశివుని దివ్య క్షేత్రాన్ని దేదీప్యమానంగా చేశానన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నష్టపోతామన్నారు. అసాధ్యమనుకున్న పనులను సుసాధ్యం చేసిన తనను మళ్లీ దీవించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దంపతులను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, నందిపేట ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కుద్వాన్‌పూర్ సొసైటీ చైర్మన్ కార్తిక్‌రెడ్డి, అంకాపూర్ సర్పంచ్ పూజితాకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.